క్లుప్తంగా

నామినేషన్ ర్యాలీకి భారీగా తరలిరావాలి

చౌటుప్పల్ : భువనగిరిలో మంగళవారం ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మున్సిపల్, మండల కమిటీ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేష్‌యాదవ్ సోమవారం తెలిపారు. అందులో భాగంగా ఎల్లమ్మ దేవాలయం నుంచి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, ఎంపీ లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారని తెలిపారు.

పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన

ఆలేరురూరల్ : ఆలేరు మున్సిపాలిటీ 6వ వార్డు బాహదూర్పేట, మంతపురి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, కౌమార దశలో ఉన్న బాలికలకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమారాణి, అంగన్‌వాడీ టీచర్లు అన్నపూర్ణ, కొరుటూరి బాలమణి పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా మహేందర్



భువనగిరిటౌన్ : భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా అడ్డగూడూరు మండలం కంచనపల్లికి చెందిన మహేందర్‌ని నియమిస్తూ సోమవారం యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ సురభి ద్వివేది, అధ్యక్షుడు శివసేన రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానన్నారు.

వెంకటేష్‌కు డాక్టరేట్ ప్రదానం




భువనగిరి : పట్టణంలోని స్టాన్‌ఫోర్డ్ పీజీ కళాశాలలో హెచ్‌ఓడీగా పనిచేస్తున్న వెంకటేష్‌కు డాక్టరేట్ లభించింది. బిజినేస్ మేనేజ్‌మెంట్ సబ్జెక్టులో డాక్టర్ జక్కా సురేష్‌రెడ్డి పర్యవేక్షణలో డిజిటల్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్ ఏ స్టడీ ఆఫ్ సెలక్ట్ కంపెనీస్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశం పై పరిశోధన పూర్తి చేశారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో సోమవారం డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. పట్టణంలోని ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, స్థానిక స్టాన్‌ఫోర్డ్ పీజీ కళాశాలలో ఎంబీఏ పూర్తి చేసిన బొమ్మాయిపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్‌కు డాక్టరేట్ రావడం పట్ల కళాశాల కరస్పాండెంట్ లింగారెడ్డి, ఎస్ఆర్ స్కూల్ యాజమాన్యం అభినందనలు తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం

రామన్నపేట : ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు నగేష్ తెలిపారు. సోమవారం ఎన్నారం ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐదవ తరగతి పూర్తయిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధికి విరాళాలు, ఫర్నిచర్ బహూకరించిన దాతలను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజగోపాల్, తాజా మాజీ సర్పంచ్ మెట్టు మహేందర్‌రెడ్డి, వి.హరిబాబు, ఏనుగు రాంరెడ్డి, లగ్గాల స్వామి, కొండూరు శంకర్, రమేష్, నల్ల నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న బూర నర్సయ్యగౌడ్

ఆలేరురూరల్ : ఆలేరు మండలం కందిగడ్డ తండా గ్రామ పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ భర్త కెతావత్ వీరయ్య సోమవారం భువనగిరి బీజేపీ కార్యాయలంలో తన అనుచరులతో కలిసి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, అశోక్, చిరిగే శ్రీనివాస్, కుమారస్వామి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

మోత్కూరు : మోత్కూరుకు చెందిన బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, 10వ వార్డు కౌన్సిలర్ బొడ్డుపల్లి కళ్యాణ్‌చక్రవర్తి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం తెలిపారు. పార్టీకి దూరం పెడుతున్నారనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

కరపత్రాల ఆవిష్కరణ

మోత్కూరు : మోత్కూరులో మంగళవారం జరిగే వీర హనుమాన్ విజయోత్సవ ర్యాలీ కరపత్రాలను విశ్వ హిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, గుండగోని రామచంద్రు గౌడ్, కౌన్సిలర్ కళ్యాణ్‌చక్రవర్తి పాల్గొన్నారు.

ఈదురుగాలులు.. వర్షబీభత్సం

- గుండాలలో రామసముద్రంలోకి కొట్టుకుపోయిన ఆరబోసిన ధాన్యం
- ఐదు మండలాల్లో రైతులకు తీరని నష్టం
- మోత్కూరులో విరిగిన విద్యుత్ స్తంభాలు, లేచిపోయిన ఇళ్ల పైకప్పులు
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్



మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యంలో నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతు



రామన్నపేట వ్యవసాయమార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

రామన్నపేట : అసలే కరువుతో అల్లాడుతున్న అన్నాదాత ప్రకృతి ప్రకోపానికి మరోమారు ఆగమాగమయ్యాడు. ఆదివారం రాత్రి జిల్లాలోని రామన్నపేట, మోత్కూరు, ఆత్మకూర్(ఎం), గుండాల తదితర మండలాల్లో భారీ ఈదురుగాలులతో పాటు కురిసిన వర్షం రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దవ్వగా మామిడికాయలు నేలరాలాయి. మరికొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి.

రామన్నపేటలో 31.3 మిల్లీ మీటర్ల వర్షపాతం

మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి ఈదురు గాలులు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. 31.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. ధాన్యపురాశుల కిందకు చేరిన నీటిని తొలగించేందుకు రైతులు తీవ్రంగా శ్రమించవలసి వచ్చింది. తూకం వేసిన బస్తాలు సైతం తడిసి పోయాయి. వెల్లంకి, కక్కిరేణి, ఎన్నారం గ్రామాల్లో సుమారు 21 ఎకరాల్లో మామిడి తోటల్లో కాయలు నేల రాలాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరిచేలు నేల వాలాయి. చెట్లు విరిగిపడ్డాయి.

ఆత్మకూర్(ఎం)లో..

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసి పోయింది. ఇప్పటి వరకు మండలంలో 89వేల క్వింటాళ్ల ధాన్యం తూకం వేశారు. అందులో 35 వేల క్వింటాళ్ల ధాన్యం ఎగుమతి అయ్యింది. మిగతా ధాన్యం ఎగుమతి కాకపోవడంతో రాత్రి కురిసిన వర్షానికి తూకం వేసిన బస్తాలు తడిసిపోయాయి. రైతులు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టే పనిలో ఉన్నారు. మండలంలో 1400ల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. రాత్రి వీచిన ఈదురుగాలులకు మామిడి కాయలు నేల రాలాయి. మండలంలో సుమారు 4 ఎకరాల్లో మామిడి కాయలు రాలినట్లుగా ఉద్యాన శాఖ అధికారి నసీమా చెబుతున్నారు.

మోత్కూరులో భారీ వర్షం

మోత్కూరు : మోత్కూరులో ఆదివారం రాత్రి భారీ ఈదురు గాలులు, ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీ ఈదురు గాలులకు పలు ఇండ్ల రేకులు, ఇంటి పైకప్పులు, వ్యవసాయ క్షేత్రాల్లో పెద్ద ఎత్తున రేకులు లేచిపోయాయి. మోత్కూరు మార్కెట్ యార్డులో ధాన్యం రాశులు, బస్తాలు తడిసి పోయాయి. సీసీ ప్లాట్‌ఫామ్ కావడంతో ధాన్యం మార్కెట్ కాలువలో కొట్టుకుపోయింది. బుజిలాపురం, అనాజిపురం, దాచారం, పొడిచేడు, దత్తప్పగూడెం, మోత్కూరు, కొండాపురం, ముశిపట్ల గ్రామాల్లో ఈదురు గాలులకు తోటల్లోనే మామిడి కాయలు నేల రాలాయి. పొడిచేడులో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. మోత్కూరులో నల్లోల్ల వ్యవసాయ బావి వద్ద తాటిచెట్టుపై పిడుగు పడింది. బుజిలాపురంలో ఓ రైతు ఎస్ఆర్‌గా వద్ద ఈదురు గాలులకు రేకుల షెడ్డు ధ్వంసమయింది. సుమారు 70 ఎకరాల పై చిలుకు మామిడి తోటలో నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

అడ్డగూడూరు మండలంలో..

అడ్డగూడూరు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పిడుగుపాటుకు కంచనపల్లి గ్రామానికి చెందిన బోయిన లింగయ్య గేదె మృతిచెందింది. అదే విధంగా చేడె చంద్రయ్యకు చెందిన ఏడు ఎకరాల్లో మామిడి కాయలు నేల రాలాయి. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తడిసిపోయింది.

వర్షానికి తడిసిన ధాన్యం

గుండాల : మండలంలో ఆదివారం రాత్రి వీచిన భారీ ఈదురు గాలులు, వర్షానికి వరి ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు పోసిన ధాన్యం తడిసిపోగా ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. గుండాలలో బండ మీద పోసిన వరి ధాన్యం భారీ వర్షానికి పక్కనే ఉన్న రామ సముద్రంలోకి కొట్టుకుపోయింది. మండలంలోని పెద్దపడిశాల గ్రామంలో పిడుగుపాటుతో అవిరేండ్ల వెంకటయ్య ఎద్దు మృతి చెందింది. బ్రాహ్మణపల్లి, రామారం, అనంతారం గ్రామాల్లో పలువురు రైతుల తోటల్లోని మామిడికాయలు పూర్తిగా రాలిపోయాయి. సుమారుగా 20మంది రైతుల మామిడి 24ఎకరాల్లో మామిడి కాయలు రాలిపోయినట్లు అధికారులు అంచనా వేశారు.



గుండాల మండలం బ్రాహ్మణపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతు



రామన్నపేట: నేల రాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న అధికారి కవిత



అడ్డగూడూరు : మృతిచెందిన గేదె వద్ద లింగయ్య



ఆత్మకూరు(ఎం): కూరెల్లలో రాలిన మామిడి కాయలను ఏరుతున్న కూలీలు

రైతులను మోసం చేస్తున్న సీఎం



చౌటుప్పల్ : కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చౌటుప్పల్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాయ మాటలతో రైతులను మోసం చేస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్ విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం రోజుకో మాటతో మభ్యపెడుతున్నారని తెలిపారు. పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం బీజేపీ బృందం సందర్శించింది. ధాన్యం కుప్పలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఏమాత్రం వేగం లేదన్నారు. హమాలీ పేరిట రైతుల వద్ద క్వింటాలుకు రూ.38 తీసుకుంటూ దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన క్వింటాలుకు రూ.500 బోనస్ బోగస్‌గా మారిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ పోలోజు శ్రీధర్‌బాబు, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, కందుల తానీషా, దాసోజు భిక్షమాచారి, ఊడుగు వెంకటేశం, కట్ట కృష్ణ, ఉబ్బు భిక్షపతి, కాసుల వెంకటేశం, వనం ధనుంజయ్య, గట్టు మొగులయ్య, నల్ల శివప్రసాద్, ఉష్కాగుల శ్రీశైలం, కంచర్ల వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మార్కెట్‌లో తడిసిన ధాన్యం పరిశీలన



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

మోత్కూరు : వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య డిమాండ్ చేశారు. మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సోమవారం పరిశీలించారు. మార్కెట్‌లో ఉన్న రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత 25 రోజుల నుండి ధాన్యం కొనుగోలు పూర్తి స్థాయిలో జరగడం లేదని, సకాలంలో లారీలు రాకపోవడం వల్ల ధాన్యపు రాశులు తడిసి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు దొంతి నరసింహారెడ్డి, గౌరు శ్రీనివాస్, చేకూరి మల్లేషం, నల్ల మాశిరెడ్డి, జినుకల దశరథ, ఎడ్ల రాము, యాకేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

అకాల వర్షంతో నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

గుండాల : ప్రభుత్వం తక్షణమే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు పాలి శ్రీను డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని బండపై పోసిన వరి ధాన్యాన్ని కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తూకం వేసిన తరలించక పోవడంతో రైతులు అకాల వర్షానికి నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు యాదవరెడ్డి, విజయ్‌రెడ్డి, రాజు, సాయి, సురేష్, వజీర్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూర నర్సయ్యగౌడ్‌ను ఎంపీగా గెలిపించాలి



రామన్నపేట: దుబ్బాకలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చౌటుప్పల్ : మండల వ్యాప్తంగా బీజేపీ ఇంటింటి ప్రచారం కొనసాగుతుంది. సోమవారం పలు గ్రామాల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. సంక్షేమ పథకాల వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గల్లీలో ఎవరు పాలన చేసినా ఢిల్లీలో మాత్రం మోదీ ఉండాలని, అప్పుడే దేశం క్షేమంగా ఉంటుందని తెలిపారు. కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి ఎంపీగా బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

రామన్నపేట : భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ కార్యకర్తలు సోమవారం వెల్లంకి, దుబ్బాక గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మోదీ పథకాలను వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమయిందని ఆరోపించారు. కార్యక్రమంలో మదూరి ప్రభాకర్‌రావు, తాటిపాముల శివక్రిష్ణ, కన్నెకంటి వెంకటేశ్వరాచారి, శుభకోటి శశికృష్ణమాచారి, గుండాల అంజయ్య, కొమ్ము యాదయ్య, మిర్యాల రాజ్‌కుమార్, తాటిపాముల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా బీరప్ప కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న ఒగ్గు పూజారులు



ఒగ్గు కళాకారుల విన్యాసాలతో బోనాల వేడుక

రామన్నపేట : మండలంలోని సిరిపురం గ్రామంలో శ్రీ బీరప్ప, కామరాతిదేవి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఒగ్గు పూజారులు కనుల పండువగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం మైలలు తీసి, జల్లి గంగాస్నానం, కొట్నం నిర్వహించారు. ఆదివారం రాత్రి ఒగ్గు కళాకారుల విన్యాసాలతో బోనాలను ఊరేపింపుగా తీసుకువెళ్లి నైవేద్యంగా సమర్పించారు. కల్యాణాన్ని తిలకించడానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. పెద్దకుర్మ శెల్వోజీ ఉత్సవ నిర్వాహకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవాలయాల ఉత్సవాలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

ఆత్మకూరు(ఎం): మండలంలోని కూరెల్లలో గ్రామ దేవాలయాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం శ్రీచండికాంబా సోమేశ్వర స్వామి, శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయాల్లో ఉదయం గణపతి పూజ నిర్వహించారు. స్వస్తి వాచనం, ధ్వజారోహణం, యాగశాల ప్రవేశము, దీక్షకంకణధారణ, అఖండ దీపస్థాపన, అంకురార్పణము, వాస్తు, నవగ్రహ, అష్టదిక్పాలక, మోగిని, పంచబ్రహ్మ, క్షేత్రపాలక, అగ్నిప్రతిష్ట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 24న ప్రతిష్టించనున్న దేవతామూర్తుల విగ్రహాలకు, ధ్వజ స్తంభాలకు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం జలాధివాసము, జలాధివాసంగా హోమము నిర్వహించారు. గ్రామస్తులు జలాభిషేకం చేశారు. అన్నదానం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

ఎన్‌సీసీలో గురుకుల విద్యార్థుల ప్రతిభ

బీబీనగర్ : ఎన్‌సీసీ శిక్షణ క్యాడెట్లలో దేశభక్తి, శ్రద్ధ, ఆత్మస్థైర్యం, నాయకత్వ లక్షణాలను పెంచుతుందని సాంఘిక సంక్షేమ గురుకుల సాయుధ శిక్షణ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామక పాండురంగ శర్మ అన్నారు. సోమవారం మూడేళ్ల ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసుకున్న క్యాడెట్లకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో 90శాతం విద్యార్థులు ఉత్తీర్ణుల య్యారని తెలిపారు. విజయంలో భాగస్వాములైన ఎన్‌సీసీ ఏఎన్‌ఓ డాక్టర్ రూప, మిలటరీ డైరెక్టర్ రాఖీ చౌహాన్‌ను ప్రత్యేక అభినందించారు.

రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

భువనగిరి రూరల్ : కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కిసాన్ మోర్చా కార్యదర్శి వల్దాస్ రాజ్ కాశభైరవ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బస్వాపురం, వడపర్తి, హన్మాపురం గ్రామాల్లో సోమవారం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం రెడ్డి, చీరిక సురేష్‌రెడ్డి, కుశంగల ప్రభాకర్, అనీల్, బబ్బూరి సురేష్, ఎడ్ల చంద్రశేఖర్, నారాయణ పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలి

భువనగిరి రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ప్రజా పోరాటాలు నిర్వహిస్తున్న సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ కోరారు. మండలంలోని నందనం, ముస్త్యాలపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పల్లెర్ల అంజయ్య, కొండపురం యాదగిరి, కల్లెం లక్ష్మీనర్సయ్య, భూపాల్‌రెడ్డి, లచ్చిరెడ్డి, సిద్ధిరాములు పాల్గొన్నారు.

వర్గ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి

భూదాన్‌పోచంపల్లి : లెనిన్ స్ఫూర్తితో దోపిడి లేని వర్గరహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రగతిశీల యువజన సంఘం పట్టణ కార్యదర్శి పగుడాల శివ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమక్రసీ ఆధ్వర్యంలో మార్కిస్ట్ నేత లెనిన్ 154వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పి. సతీష్, మహేందర్, సాయినాథ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ మహోపాధ్యాయునికి నివాళి

భువనగిరిటౌన్ : అంతరాలు లేని సమాజ నిర్మాణానికి కృషిచేసిన మహనీయుడు లెనిన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం లెనిన్ మహోపాధ్యాయుని 154వ జయంతిని నిర్వహించారు. సమావేశంలో నాయకులు అనిల్‌కుమార్, ఏశాల అశోక్, ఎల్లంకి మహేష్, కాసపాక దయాకర్, ఎర్రోళ్ల లింగస్వామి, ఉప్పుల శాంతి కుమార్, బాల నరసింహ పాల్గొన్నారు.

ఇక్కుర్తిలో..

మోటకొండూర్: మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో లెనిన్ 154వ జయంతి, సీపీఐ ఎంఎల్ 55వ ఆవిర్భావదినోత్సవాన్ని సోమవారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి అసువులు బాసిన యోధులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ జనార్దన్, చిరబోయిన రాజయ్య, పిన్నపురెడ్డి రాఘవరెడ్డి, శ్రీకాంత్, కొముర‌య్య, నర్సింహారెడ్డి, రామచంద్రు ఉన్నారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

సంస్థాన్ నారాయణపురం: భువనగిరి సీపీఎం అభ్యర్థిగా జాహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు సోమవారం వావిళ్లపల్లిలో ఇంటిఇంటికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాసాచారి, చింతకాయల నర్సింహ, కుక్కల అంజయ్య, సత్తయ్య, నర్సింహ, పుల్లయ్య, అంజయ్య, లింగస్వామి తదితరులున్నారు.

యాదాద్రీశుడి ఆశీస్సులతో విజయం సాధిస్తా

- భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్



యాదాద్రి ఆలయంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేషం తదితరులు

యాదగిరిగుట్ట : పార్లమెంట్ ఎన్నికల్లో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో విజయం సాధిస్తానని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ అన్నారు. తన నామినేషన్ సందర్భంగా యాదాద్రీశుడిని సోమవారం మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్ రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని, ఎంపీ ఎన్నికల్లో గెలిపించేలా దీవించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, నాయకులు కర్రె వెంకటయ్య, పాపట్ల నరహరి, తోటకూరి బీరయ్య, బాబురావుగౌడ్ ఉన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత, చిత్రంలో అభ్యర్థి క్యామ మల్లేష్ తదితరులు

గుండాల : అబద్ధాలు, అసత్య ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కార్నర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు చేస్తామన్న రూ.2 లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌కు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి క్యామ మల్లేష్, టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, యుగేంధర్‌రావు, సూదగాని హరిశంకర్ గౌడ్, ఎంపీపీ తాండ్ర అమరావతి, ఖలీల్, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మోత్కూరు వాసి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్



నామినేషన్ వేస్తున్న మల్లయ్య

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెం వాసి కొంగరి మల్లయ్య భువనగిరి పార్లమెంట్ స్థానానికి సోమవారం నామినేషన్ వేశారు. కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు నామినేషన్ పత్రాన్ని అందజేశారు. యూసీసీఆర్(ఎం.ఎల్) పార్టీ బలపరిచిన స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్లు మల్లయ్య తెలిపారు.

ఘనంగా గట్టు మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

బొమ్మలరామారం : మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీ గట్టు మైసమ్మ అమ్మవారి ఆలయ వార్షిక ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి బోనాలతో మొక్కులు చెల్లించుకొని నైవేద్యం సమర్పించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.



పూజలు చేస్తున్న విప్ అయిలయ్య

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

భువనగిరి : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు కోరారు. పట్టణంలోని టీచర్స్ కాలనీలో సోమవారం గ్రేస్ చిల్డ్రన్ హోమ్‌ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి సామాజిక కార్యకర్త వెల్లంకి పురుషోత్తంరెడ్డితో ఆయన హాజరై మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణతో పాటు మొక్కలను నాటడం వల్ల ప్రజలకు ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రేస్ చిల్డ్రన్ హోమ్ డైరెక్టర్ వల్లూరి జాన్ ప్రసాద్, అనాథ ఆశ్రమ పిల్లలు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ సెలక్షన్స్

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని వంగపల్లి గ్రామంలోని స్వామి వివేకానంద ఫార్మసీ కళాశాలలో ఆప్టివల్ మెడ్‌ప్లస్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. విద్యార్థులకు మౌకిక, రాత పరీక్ష నిర్వహించి, ఇంటర్వ్యూలు చేశారు. అర్హత సాధించిన 15 మందికి ఆఫర్ లెటర్లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఉదయ్ చందర్, ప్రిన్సిపాల్ హేమామాలి, మెడ్‌ప్లస్ హెచ్ఆర్ ఎండీ తాజుద్దీన్ పాల్గొన్నారు.

సమయ పాలన పాటించని ఉద్యోగులు

భువనగిరిటౌన్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటల లోపు కలెక్టరేట్‌లో అందుబాటు ఉంటున్నారు. వీరితో పాటు కలెక్టర్ సైతం వస్తున్నా... కింది స్థాయి ఉద్యోగుల తీరు మాత్రం మారడం లేదు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు సుమారు 50మంది ఉద్యోగులు కలెక్టరేట్‌లోకి ఐడీ కార్డులు చూపించి వచ్చారని పోలీసులు చెబుతున్నారు. వారి సమయ పాలన చూసి పోలీసులే ఆశ్చర్యానికి గురవుతున్నారు.

మహిళ ప్రాణాలను కాపాడిన పోలీసులు

భువనగిరి క్రైం : ఆత్మహత్యయత్నానికి సిద్ధపడిన ఓ మహిళను సోమవారం పోలీసులు కాపాడారు. భువనగిరికి చెందిన మహిళ తన భర్తతో గొడవపడి పట్టణ పరిధిలోని రైల్వే ట్రాక్‌పైకి వెళ్తుండగా స్థానికులు గమనించారు. 100కు ఫోన్ చేయడంతో పోలీసులు వచ్చి మహిళను అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం దంపతులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు.